# ఆకుపచ్చ ప్రపంచం

మాధవయ్యది మామూలు ప్రపంచం కాదు. మరో ప్రపంచం. ఆకుపచ్చ ప్రపంచం. అదో ప్రపంచం. ఎప్పుడూ పుస్తకాలు చదివేవాణ్ణి పుస్తకాల పురుగు అంటారు. ఆ పద్ధతిలోనే, మాధవయ్యను పొలం పురుగు అన్నారు. "పొలం పిచ్చోడు" అన్నారు ఆ ఊరు వాళ్ళంతా. ఆ అనే వాళ్ళను చూసి నవ్వుకునేవాడు మాధవయ్య. ఆ నవ్వులో బోలెడంత తృప్తి ఉండేది.

ఎప్పుడూ రాళ్ళు తప్ప ఏమీ పండని ఆ పొలంలో బంగారం పండించి సెభాష్ అనిపించుకున్నాడు. రాళ్ళు పండుతున్న పదెకరాల పొలాన్ని చౌకగా కొన్నాడు. కొన్న తరువాత, నీళ్ళకోసం భగీరథ ప్రయత్నం చేశాడు. సాధించాడు. దానికి చాలా డబ్బు ఖర్చయినా, తన ఆశ

ఫలించిందని ఎంతగానో సంతోషించాడు. అప్పటినుండీ పంచ ప్రాణాలూ పొలం మీదనే పెట్టుకుని పసిపిల్లను సాకినట్లు సాకాడు దాన్ని.

ఇల్లూ, నగానట్రా తాకట్టుపెట్టి శెట్టి దగ్గర తెచ్చిన డబ్బంతా పొలం మీద పెట్టాడు. అసలు సంగతి అలా ఉంచి వడ్డీమాత్రం కట్టేటప్పటికి తలప్రాణం తోకకు వచ్చేది మాధవయ్యకు.

పక్షులన్నా, మొక్కలన్నా, చెట్లన్నా, తోటలన్నా మాధవయ్యకు పంచప్రాణం. మాధవయ్య ఇంటికి బోలెడు పెరడు ఉంది. ఒక్క అంగుళం స్థలం ఊరికే పోనివ్వకుండా- పూల మొక్కలతోనూ కూర పాదులతోనూ నింపేశాడు దాన్ని. ఎప్పుడో నిద్రపోయేటప్పుడు ఆ కాస్త టైమూ తప్ప. మిగతా కాలం అంతా, పొలం మీదా, పెరడుమీదా విని యోగించేవాడు.

ఇదిగాక, పావురాళ్ళు, కోళ్ళు పెంచేవాడు మాధవయ్య. మాధవయ్య దగ్గర తెల్లటి ఆవు ఒకటి ఉంది. ఉదయం లేస్తూనే దానికి దణ్ణం పెట్టేది. ఏ పనికీ ఉపక్రమించేవాడు కాదు. ఆ ఆవుకో బుజ్జాయి ఉంది. దానిది గోధుమవన్నె ఛాయ. దాన్నెప్పుడూ ముద్దాడుతూ ఉంటాడు

పెరట్లో వున్న పూలమొక్కలు మాధవయ్యను చూస్తే నవ్వుతాయి. నవ్విస్తాయి మాధవయ్య భాష- మనుషులకు తప్ప అందరికీ అర్థమవుతుంది. మొక్కలతోనూ, పక్షులతోనూ, ఆవుతోనూ మాట్లాడుతూ ఉంటాడు. అందుకనే రామాపురంలో ఉన్న వాళ్ళంతా మాధవయ్యను “పిచ్చోడు” అన్నారు. ఎవరిపిచ్చి వాళ్ళకానందంలే అనుకున్నాడు మాధవయ్య.

మాధవయ్య కొడుకు పట్నంలో చదువుతున్నాడు. ఎప్పుడూ డబ్బు పంపమని తండ్రిని ఒత్తిడి చేస్తూనే ఉంటాడు ఎందుకొచ్చిన కాలేజి చదువులో అని మాధవయ్య అనుకుంటూ ఉంటాడు. మాధవయ్య కొడుకు కూడా తండ్రిని “పిచ్చోడి” కింద కట్టేశాడు. ఒకసారి సెలవలకు వచ్చినప్పుడు తండ్రితో అన్నాడు... “ఏవిటి నాన్నా ఎప్పుడూ పొలం పొలం. అని పట్టుకు కూచుంటావు దానిమీద బోలెడు అప్పు చేశావు ... ఎందుకొచ్చిన శ్రమ చెప్పు... ఈ వయసులో. ఈ ఇల్లు పొలం అమ్మేసి పట్నానికి వెళ్దాం. నేనేదో ఉద్యోగంలో చేర్తాను. పట్నవాసం హాయిగా ఉంటుంది” అని.

మాధవయ్యకు కొరడాతో కొట్టినట్లయింది. తమాయించుకుని నవ్వి ఊరుకున్నాడు.

మాధవయ్య చేతిచలవో - లేకపోతే అతను చేసిన కృషి ఫలితమో గాని...పట్టిందంతా బంగారం అయింది.

కాయగూరలు ఏపుగా పెరిగినై.

రంగు రంగుల రోజాపూలు విపరీతంగా ఎదిగినై.

పొలంలో కొంతభాగం చెరకు, అరటి కింద వినియోగించాడు.

పట్నంలో ఎగ్జిబిషన్ జరిగినప్పుడల్లా- తను పండించిన కాయగూరలూ మొదలైనవి ఉత్సాహంగా తీసికెళ్ళి ప్రదర్శించేవాడు. ఎన్నో బహుమతు లందుకున్నాడు. ఇంటికి వచ్చి మొక్కల్ని, అవును, ఆ ఆనందోత్సాహంతో కావలించుకునేవాడు. ఆనందంలో అతని కళ్ళు చెమర్చేవి.

చెరకుతో టకు అరటితోటకు మళ్ళీ బోలెడు డబ్బు కావల్సి వచ్చింది. ఎక్కడి డబ్బూ సరిపోవడంలేదు. ఎరువులకు, వాసాలకు. ఇంకా అమ్మాయి బాపతు ఖర్చులకు డబ్బుకు కొంచెం గిజగిజలాడుతున్నాడు. శెట్టిదగ్గర తెచ్చిన డబ్బు వడ్డితోసహా మూడింతలయింది అప్పటికే.

పరిస్థితు లిలా ఉంటే కొడుకు డబ్బు పంపించమని

ఒత్తిడి చేస్తున్నాడు. అవతల ఆడపిల్ల పెళ్ళికి ఎదిగి కూచ్చుంది.

తెలుగు పేపర్లలోనూ, రేడియోలోనూ. ఈ మధ్య ఎక్కువగా వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం వాళ్ళూ ఇంకా కొన్ని బ్యాంకులూ సహాయం చేస్తున్నట్టు ప్రకటిస్తున్నారు. ఎన్నో సదుపాయాలున్నాయి అంటున్నారు మాధవయ్యకు ఈ విషయం తెలిసింది గాని- అసలే అప్పుల్లో నిండా మునిగి ఉన్నాను నాకెవరు సహాయం చేస్తారు అనుకున్నాడు. నే నెదో చిన్న రైతును. బ్యాంకుకు వెళ్ళి అడిగే తాహాతు నా కెక్కడవుంది" అనుకున్నాడు. ఒకవైపు ఏదో ఆశ, మరో వైపు నిరుత్సాహం... అతన్ని తరుముతున్నై. ఊళ్ళో ఒక రిద్దరు పెద్ద రైతులతో సంప్రదించాడు. "మాధవయ్యా... ఓసారి పట్నం వెళ్ళి బ్యాంకులో ప్రయత్నం చెయ్యి కష్ట సుఖాలు చెప్పుకో ఆదుకుంటే ఆదుకుంటారు. ప్రయత్నం చేయడంవల్ల నష్టం లేదుకదా"- అన్నారు.

ధైర్యంచేసి పట్నం వెళ్ళి భయపడుతూ, భయపడుతూ బ్యాంక్‌లో అడుగు పెట్టాడు. తనకొచ్చిన బహుమతులు చూపించాడు. ఎన్నేళ్ళబట్టి ఎలా కృషి చేస్తున్నాడో చెప్పు కున్నాడు. బ్యాంక్ వడ్డీ చాలా తక్కువ అని తెలుసుకునే టప్పటికి ఎగిరి గంతేశాడు.

ఆ సమయంలో శెట్టి అతనికి ఓ కిరాతకుడుగా కన్పించాడు. బ్యాంక్ వారు మాధవయ్యను విచారించి అన్ని విషయాలు తెలుసుకున్నారు. పంట చేతికి రావడానికి ముఖ్యంగా ఎంత డబ్బు అవసరమో వివరించి చెప్పాడు. అంచనా ప్రకారం డబ్బు ఖర్చు పెడితే చెరకుమీద, అరటి మీద బోలెడు డబ్బు వస్తుంది. మాధవయ్య నిజాయితీని బ్యాంక్‌వాళ్ళు అర్థం చేసుకున్నారు. రామాపురంవచ్చి బ్యాంక్ వాళ్ళు మాధవయ్య తోటను చూశారు. శెట్టిని వదిలించుకోడానికికూడా డబ్బు ఇస్తామన్నారు. పొలం, ఇల్లు, నగనట్రు... ఉన్న స్థిరాస్తి చరాస్తి కూడా బ్యాంక్ వారి ఆధీనంలో ఉంచడానికి ఒప్పుకున్నాడు మాధవయ్య.

బ్యాంక్ వారిచ్చిన డబ్బుతో కావలసిన ఎరువులు మొదలైనవి కొని ... అరటితోటను, చెరకు తోటను తన చెమటతో తడిపేశాడు. అతని కృషి ఫలించింది.

చెరకు ఏపుగా పండింది. పంచదార ఫ్యాక్టరీవాళ్ళు ఎక్కువ ఖరీదుకు కొనుక్కున్నారు. అరటిగెలల సంగతి చెప్పనే అక్కర్లేదు. కాయలు పది మొదలు పన్నెండంగుళాల వరకూ వచ్చినయి. మాధవయ్య సంతోషానికి మేర లేదు.

బి. ఏ. అయిన తరువాత ఇంటికి వచ్చాడు కొడుకు. పట్నంలో మళ్ళీ యమ్మే చదవాల్నని అతని కోరిక.

మాధవయ్యకు అనుకున్న దానికన్నా ఎక్కువే ఆదాయం వచ్చింది. దాంట్లో కొంత మొత్తం బ్యాంకుకు కట్టేశాడు. మరో సంవత్సరమైతే మిగతాది కూడా తీర్చేస్తాడు.

కొడుకును పై చదువులకు పంపించడం యిష్టంలేదు మాధవయ్యకు. కొడుక్కు ఈ విషయం చెప్పడానికి భయపడుతున్నాడు. రెండు మూడేళ్ళు ఇలా కష్టపడితే మరి కొంత పొలం కొనుక్కోవచ్చు... ఆకుపచ్చ ప్రపంచం తప్ప మరోటి కన్పించడం లేదు మాధవయ్యకు...

కొడుకుని ఒకటి రెండుసార్లు పొలానికి తీసికెళ్ళి చూపించాడు. క్రమ క్రమంగా అతనిచేత చిన్న చిన్న పనులు గూడా చేయిస్తున్నాడు.

"నీవొచ్చిం తరువాత కాయగూరలు, పూల మొక్కలు బాగా వస్తున్నాయిరా అబ్బీ..." అన్నాడు ఓ రోజున మాధవయ్య కొడుకుతో...

అనుకోకుండా క్రమేణా కొడుకులో వచ్చిన మార్పు

గ్రహించాడు. తనకన్నా ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నాడు. దిగిం తరువాత లోతు తెలిసింది కొడుక్కి. పట్నానికి రాసి కొన్ని పుస్తకాలు తెప్పించాడు వ్యవసాయానికి సంబంధించినవి.

ఒకరోజు భోజనాలు చేస్తుండగా మాధవయ్య కొడుకును హెచ్చరించాడు. "ఏరా అబ్బీ ... యమ్మె సంగతేం చేశావ్" అని.

"యమ్మెలేదు గిమ్మెలేదు నాన్నా... నాకీ ఆకుపచ్చ ప్రపంచం తప్ప...మరో దాంతో సంబంధం లేదు...వచ్చే ఏడు పంటలో తెలుస్తుందిలే నా తడాఖా..." అన్నాడు అబ్బి...

ఆనంద బాష్పాలో... ఏవిటో తెలియదుగాని మాధవయ్య కళ్ళు చెమర్చినయి...!!

అన్నదాత

— ... —